మాతాశిశు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

● యూఎన్ఐసీఈఎఫ్ ఢిల్లీ రాష్ట్ర ప్రతినిధులు

పీహెచ్‌సీలో వైద్య సేవల గురించి అడిగి తెలుసుకుంటున్న యునిసెఫ్ కన్సల్టెంట్ మిస్ క్యాతి వాట్స్, రాష్ట్ర అధికారులు

భూదాన్ పోచంపల్లి, మే 8 : మాతాశిశు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్ ఎమర్జెన్సీ ఫండ్ (యూఎన్ఐసీఈఎఫ్) ఢిల్లీ కన్సల్టెంట్ మిస్ క్యాతి వాట్స్, రాష్ట్ర మెటర్నల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శిల్ప, న్యూట్రీషనిస్ట్ డాక్టర్ సౌజన్య అన్నారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం యునిసెఫ్ ఢిల్లీ రాష్ట్ర ప్రతినిధుల బృందం సందర్శించింది. ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆరోగ్య సేవలు, వాటి అమలు విధానం, వారికి అందించే ఐరన్ పోలిక్ యాసిడ్, కాల్షియం మాత్రలు వాడే విధానం ఉపయోగాల గురించి ఆరోగ్య కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలను అందరికీ తప్పకుండా అందించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. మానసిక ఆరోగ్యం మెరుగుపరుచుటకు వారు చేయాల్సిన సేవల గురించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ నెల 15న అందాల భామలు పోచంపల్లికి రానున్న సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్ టూరిజంను సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ యశోద, మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి, హెల్త్ ఎడ్యుకేటర్ వసంత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పోతారెడ్డి, సూపర్‌వైజర్లు అరుంధతి, శ్రీనివాస్, శ్రీదేవి, ఆరోగ్య కేంద్రం నర్సింగ్ ఆఫీసర్ లావణ్య, ఫార్మాసిస్ట్ ప్రదీప్, ల్యాబ్ టెక్నీషియన్ పద్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోచంపల్లిలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

● క్రైం డీసీపీ నరసింహారెడ్డి

టూరిజం పార్కు పరిశీలిస్తున్న క్రైం డీసీపీ నరసింహారెడ్డి, అదనపు డీసీపీ శ్యాంసుందర్

భూదాన్ పోచంపల్లి, మే 8 : మిస్ వరల్డ్ పోటీలకు హాజరయ్యే నారీమణులు ఈ నెల 15న భూదాన్ పోచంపల్లికి రానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని క్రైం డీసీపీ జి.నరసింహారెడ్డి అధికారులకు సూచించారు. భూదాన్ పోచంపల్లిలోని టూరిజం పార్కును గురువారం ఆయన సందర్శించారు. పార్కులోని మ్యూజియం, మగ్గాలు, హంపి థియేటర్, పార్క్ ఆవరణలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. 25మంది మిస్ వరల్డ్ కాంటెస్ట్‌లు ఈ నెల 15న హైదరాబాద్ మాదాపూర్ నుంచి పోచంపల్లికి రానున్నారని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ శ్యాంసుందర్, ఏఆర్ అదనపు డీసీపీ ఎం.వెంకటరెడ్డి, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, ఐటీ ఏసీపీ నరేందర్, ఎస్ డబ్ల్యూ ఏసీపీ శైలజ, చౌటుప్పల్ సీఐ రాములు, స్థానిక ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి : అదనపు కలెక్టర్

లింగరాజుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆత్మకూరు(ఎం), మే 8 : మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. లింగరాజుపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తూకం వేసి లారీల్లో రైస్ మిల్లులకు పంపించాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ లావణ్య, ఆర్ఐ మల్లికార్జున్‌రావు ఉన్నారు.

గ్రామ సభలను సమగ్రంగా నిర్వహించాలి

● డీపీఓ సునంద, జడ్పీ సీఈఓ శోభారాణి

సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ సునంద

భువనగిరి కలెక్టరేట్, మే 8 : గ్రామాల్లో సమాచార హక్కు చట్టం, గ్రామసభలను సమగ్రంగా నిర్వహించాలని డీపీఓ సునంద, జడ్పీ సీఈఓ శోభారాణి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని 45 గ్రామ పంచాయతీల కార్యదర్శులకు గురువారం నిర్వహించిన రెండు రోజుల శిక్షణలో వారు పాల్గొన్ని మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టే పనులు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమగ్రంగా గ్రామసభల్లో ప్రజలకు తెలియజెప్పాలన్నారు. సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల రికార్డులను సమర్థవంతంగా చేపట్టి, పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం గ్రామసభలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీకాంత్, శిక్షణ నిర్వాహకులు నవీన్‌కుమార్, దినకర్, వెంకటేశ్వర్లు, కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీలో బీబీనగర్ ఉత్తమ మండలం

మంత్రి సీతక్క నుంచి అవార్డు అందుకుంటున్న ఏపీఎం శ్రీనివాస్

బీబీనగర్, మే 8 : ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీలో 2024-2025 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర స్థాయిలో జిల్లా నుంచి ఉత్తమ మండలం, ఉత్తమ ఏపీఎంగా బీబీనగర్ ఎంపికైనట్లు ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. 2024-2025 సంవత్సరంలో ప్రభుత్వం నిర్దేశించిన రూ.53 కోట్ల రుణాలకు గాను లబ్ధిదారులకు రూ.63 కోట్ల రుణాలు (100కు 115 శాతం) మంజూరు చేసినట్లు చెప్పారు. రుణాల చెల్లింపులో కూడా 0.05 శాతం ఎన్‌పీఏతో ముందు వరుసలో ఉన్నామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చేతులమీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. మండలానికి అవార్డు రావడానికి కృషి చేసిన సీసీ, వీఓఏ, ఎస్‌హెచ్‌జీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్, ఆర్‌డీ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేశ్‌కుమార్, సెర్ప్ సీఈఓ దివ్య పాల్గొన్నారు.

'అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలి'

ఆత్మకూరు(ఎం), మే 8 : భూ భారతి చట్టం అమలులో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రెవెన్యూ గ్రామాల్లోనే కాకుండా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించాలని మండలంలోని తిమ్మాపురం గ్రామ మాజీ సర్పంచ్ నోముల నర్సిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. మండలంలో 23 గ్రామపంచాయతీలు ఉండగా.. 17 రెవెన్యూ గ్రామాల్లో మాత్రమే సదస్సులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారని పేర్కొన్నారు. దీంతో మండలంలోని తిమ్మాపురం, పోతిరెడ్డిపల్లి, ఉప్పలపహాడ్, టి.రేపాక, మోదుగుబావిగూడెం, సారగండ్లగూడెం గ్రామాల్లోని రైతులు ఇబ్బందులు పడుతారని తెలిపారు. రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం అన్ని గ్రామాల్లో సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రపంచ సుందరీమణుల రాకకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

● కలెక్టర్ హనుమంతరావు

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, మే 8 : ప్రపంచ సుందరీమణుల రాకను పురస్కరించుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. ఈ నెల 15న జిల్లాలో ప్రపంచ సుందరీమణుల పర్యటన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట దేవాలయ ఈఓ వెంకట్రావ్, డీసీపీ అకాంక్ష్‌యాదవ్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచ సుందరీమణుల పర్యాటక ప్రాంతాల సందర్శన ఉన్నందున ఏర్పాట్లు ఘనంగా చేపట్టాలన్నారు. ఆధ్యాత్మికతను సంతరించుకున్న యాదగిరిగుట్ట, ప్రపంచ ప్రఖ్యాత చేనేత గ్రామంగా యునెస్కో గుర్తింపు పొందిన పోచంపల్లిలో ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని సూచించారు. యాదగిరిగుట్టను ఆర్చీలతో, స్వాగత తోరణాలతో ఆయా మార్గాలను అందంగా తీర్చిదిద్దాలని, విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. వారు పర్యటించే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, అందంగా తీర్చిదిద్దాలని అన్నారు. పోలీస్ అధికారులు మాక్ డ్రిల్ చేపట్టాలని సూచించారు. నీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, రహదారులను పరిశుభ్రంగా ఉంచాలని, ఏమైనా మరమ్మతులు ఉంటే చేపట్టాలని ఆదేశించారు. సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, బ్యాటరీ వాహనాలను అందుబాటులో ఉంచాలని అన్నారు. సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలన్నారు. విద్యుత్, ఫైర్ స్టేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వైద్యశాఖ అధికారులు అందుబాటులో ఉండాలని, యాదగిరిగుట్ట, పోచంపల్లిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి సేవలందించాలని సూచించారు. మున్సిపల్ అధికారులు అందుబాటులో ఉండి స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జడ్పీ సీఈఓ శోభారాణి, టూరిజం కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డి, ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, ఏసీపీలు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఘనంగా గొంగిడి మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

యాదగిరిగుట్ట వైకుంఠ ద్వారం వద్ద కేక్ కట్ చేస్తున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, మే 8 : డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఆలేరు నియోజకవర్గంలోని పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. యాదగిరిగుట్ట పట్టణంలోని గుండ్లపల్లి ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల నడుమ మహేందర్‌రెడ్డి భారీ కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. స్వామివారి పాదాల వద్ద బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్ గడ్డమీది రవీందర్‌గౌడ్, నాయకులు భారీ గజమాలతో గొంగిడి దంపతులను సత్కరించారు. స్వామివారి పాదాల వద్ద భారీ కేక్‌ను కట్ చేశారు. బొమ్మలరామారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. రాజాపేట, ఆత్మకూర్ (ఎం), మోటకొండూరు, గుండాల మండల కేంద్రాల్లో, ఆలేరు పట్టణంతోపాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

చివరి వరకూ కేసీఆర్‌తోనే.. : గొంగిడి మహేందర్‌రెడ్డి

తన ఊపిరున్నంత వరకు కేసీఆర్‌తోనే పయనం సాగిస్తానని గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు, అభిమానులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్, ప్రజల ఆశీస్సులతోనే తన సతీమణి సునీత ప్రభుత్వ విప్‌గా పదేండ్ల పాటు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపామన్నారు. తనకు డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ పదవి దక్కిందని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగానికి సేవ చేసే భాగ్యం దొరుకడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో అధికారంలోకి రాబోయేది బీఆర్ఎస్ పార్టీయేనని ధీమా వ్యక్తం చేశారు. 17నెలల్లోనే అధికార కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

బీబీనగర్, మే 8 : అనారోగ్యంతో ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సుక్క వెంకటేశ్ (50) ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వెంకటేశ్‌కు అనారోగ్య సమస్యలు ఉండటంతో శరీరం సహకరించక తరచూ బాధపడుతూ ఉండేవాడు. గురువారం తెల్లవారుజామున 4గంటల సమయంలో ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేశ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

మద్యం దుకాణంలో చోరీ

చౌటుప్పల్, మే 8 : పట్టణంలోని కంఠమహేశ్వర కాలనీలో గల శ్రీసాయి వైన్స్‌లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీసాయి వైన్స్‌ను యజమానులు బుధవారం రాత్రి మూసివేసి ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం పది గంటలకు వచ్చి చూసేసరికి షాపు గ్రిల్స్ పగులగొట్టబడి ఉంది. రూ.30వేలు చోరీకి గురైనట్లు గుర్తించి క్యాషియర్ దేశగోని వెంకన్న గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఇంట్లో నుంచి వెళ్లిపోయిన యువతి

చౌటుప్పల్ రూరల్, మే 8 : తల్లి మందలించడంతో ఇంట్లో నుంచి యువతి వెళ్లిపోయిందని గురువారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామానికి చెందిన ముద్దం నిఖిత (24) తల్లి మందలించిందని అలిగి ఈ నెల 7న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ దొరుకలేదు. ఈ మేరకు నిఖిత సోదరుడు మల్లేశ్ గురువారం చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నిఖిత ఇంటి నుంచి వెళ్లే సమయంలో బ్లూ కలర్ నైట్ ప్యాంట్, గ్రీన్ టీషర్ట్ వేసుకుందని తెలిపాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుత్ వైర్లు తగిలి గడ్డి దగ్ధం

దగ్ధమవుతున్న పశుగ్రాసం

రాజాపేట, మే 8 : గడ్డి ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధమైంది. మండలంలోని గంధమల్ల గ్రామానికి చెందిన రైతులు జనగాం జిల్లా బచ్చన్నపేట మండలం లింగంపల్లిలో కొనుగోలు చేసిన పశుగ్రాసాన్ని ట్రాక్టర్‌పై తోలుకొస్తుండగా.. బొందుగుల సమీపంలో విద్యుత్ వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. డ్రైవర్ చాకచక్యంగా ట్రాక్టర్‌ను తప్పించాడు. గడ్డి పూర్తిగా కాలిపోయింది. దీంతో ఆ రోడ్డులో కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భూదాన్ పోచంపల్లి, మే 8 : మున్సిపాలిటీ పరిధిలోని భద్రాద్రి కాలనీ, రాజీవ్‌నగర్, మార్కండేయనగర్‌లో శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ లైన్‌లో చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరం

రాజాపేట, మే 8 : మండలంలోని రాజాపేట, రఘునాథపురం, చల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈ నెల 15నుంచి 15రోజుల పాటు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంఈఓ చందా రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో ప్రవేశం కోసం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

మోదీ విధానాలను వ్యతిరేకించాలి : సీఐటీయూ

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పాండు

భూదాన్ పోచంపల్లి, మే 8 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు అన్నారు. పట్టణంలోని గురువారం జరిగిన సీఐటీయూ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి బడా పెట్టుబడుదారుల కోసం కార్మికుల శ్రమను దోచిపెట్టాలని చూస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాయాలని ప్రయత్నిస్తే కార్మికులు, కర్షకులు సంఘటితమై ప్రభుత్వాన్ని గద్దె దింపుతారని హెచ్చరించారు. కార్మికుల హక్కుల రక్షణ కోసం, లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు మంచాల మధు, దుబ్బాక జగన్, యాదగిరి, కవిత, మల్లయ్య, అనసూయ, బసవయ్య, కృష్ణారెడ్డి, రజనీకాంత్, బాలయ్య, చంద్రకళ పాల్గొన్నారు.

ఇంటి పెచ్చులు పడి ఆరుగురికి గాయాలు

బొందమ్మ ఇంట్లో కూలిన ఇంటి పైపెచ్చులు

బీబీనగర్, మే 8 : అకాల వర్షంతో ఇంటి పైపెచ్చు కూలిపోయిన ఘటన మండల పరిధిలో గురువారం చోటుచేసుకుంది. మండలంలోని అన్నంపట్ల గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న పర్రె బొందమ్మ ఇల్లు ఇటీవల కురిసిన భారీ వర్షానికి నాని గురువారం పైపెచ్చు కూలిపోయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులందరూ ఇంట్లో ఉండడంతో పెచ్చులు పడి ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారందరినీ భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. నిరుపేద కుటుంబం అయిన బొందమ్మకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించి ఆదుకోవాలని మాజీ సర్పంచ్ బొక్క వసుమతి జైపాల్‌రెడ్డి కోరారు.

అక్రమంగా నీటి తరలింపుపై చర్యలు తీసుకోవాలి

తాసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

పెన్‌పహాడ్, మే 8 : మండల పరిధిలోని మాచారం గ్రామ పరిధిలో ఉన్న రావి చెరువు నీటిని అక్రమంగా తరలింపుపై తాసీల్దార్ బాలునాయక్‌కు చెరువు కింది రైతులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొందరు ధనిక రైతులు, చెరువుకు మోటార్లు వేసి సొంత వ్యవసాయ క్షేత్రాలకు నీరు తరలిస్తున్నారని, దీంతో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయని తెలిపారు. చెరువు కింద ఉన్న చిన్న సన్నకారు బోర్లు ఎండి పోతున్నాయని, మత్స్యకారులకు జీవనోపాధి లేకుండా పోతున్నదని చెప్పారు. వారిపై తాసీల్దార్ వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు తూముల ఇంద్రసేనారావు, సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రంగినేని లక్ష్మికాంతరావు, రమేష్, రొంగినేని దామోదర్, వివేక్ తదితరులు ఉన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి : బాలకృష్ణ

హుజూర్‌నగర్, మే8 : తెలంగాణ మత్స్యకార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలో అమరవీరుల స్మారక కేంద్రంలో ఆయన మాట్లాడారు. మే 15 మత్స్య కారుల జాతీయ డిమాండ్స్ డే సందర్భంగా ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, మత్స్య కార్మిక నాయకులు హుస్సేన్, మల్లయ్య, నాగేశ్వర్‌రావు, నర్సయ్య, వెంకటి, మురళి పాల్గొన్నారు.

ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావం

రాజాపేట, మే 8 : మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావంగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్ మాట్లాడుతూ పహల్గామ్ ఉగ్రవాద చర్యకు ప్రతీకార చర్యనే ఆపరేషన్ సింధూర్ అన్నారు. ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు ఉక్కుపాదం మోపాలని సూచించారు. జై భారత్, జై జవాన్, పాకిస్తాన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపగాని బాలమణి, యాదగిరిగౌడ్, చింతల పూడి వెంకటరామిరెడ్డి. చింతలపురి భాస్కర్‌రెడ్డి, ఎర్ర గోకుల జశ్వంత్, బోగ హరినాథ్, సందిల భాస్కర్ గౌడ్, బెడిదే వీరేశం, యమ్మ భాస్కర్, సందెల వెంకటేశం, మోత్కుపల్లి బాలకృష్ణ, గంధమల్ల సురేశ్, వరిమడ్ల సురేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

చౌటుప్పల్ : పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి హైస్కూల్ విద్యార్థినులను పాఠశాలలో ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. అత్యధిక మార్కులు సాధించిన వారిలో సిలివేరు మేఘన (542), కొయ్యడ పూజ (523), మారగోని పూజ (503) బొల్లమోని పూజిత (501), ఎండీ హుమేర (501) ఉన్నారు. హెచ్ఎం భార్గవి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, నర్సింహ, సరళ, మంగ, మహేశ్వరి, లింగయ్య, ప్రతిమ, యాదయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాల్వల సర్వే చేపట్టాలి : అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, మే 8 : హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న 242 కాల్వలను సర్వే చేసి నివేదిక సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇరిగేషన్ డీఈలు, ఏఈలు, సర్వేయర్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 242 కాల్వలు, చెరువుల వారీగా సర్వే చేసి ప్రైమరీ నోటిఫికేషన్, ఫైనల్ నోటిఫికేషన్ నివేదిక సిద్ధం చేసి సంబంధిత పై అధికారులకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ఆర్డీఓ కృష్ణారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర నిర్మాతకు సన్మానం



చిత్ర నిర్మాతను సన్మానిస్తున్న నాయకులు

చౌటుప్పల్, మే 8 : స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర ఆధారంగా తీసిన యూనిటీ ది మ్యాన్ ఆఫ్ సోషల్ జస్టిస్ డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత చిరందాసు ధనుంజయను గురువారం సన్మానించారు. ఈ చిత్రానికి దాదా సాహెబ్ పాల్కే ఫిలిమ్ ఫెస్టివల్ అవార్డు రావడంతో పట్టణ కేంద్రానికి చెందిన పలువురు ఈ కార్యక్రమం చేపట్టారు. సామాజిక నేపథ్యంలో మరెన్నో చిత్రాలు తీయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీతారామచంద్రస్వామి దేవాలయ అధ్యక్షుడు బొబ్బిళ్ల మురళి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాల్యం వెంకటాచలం, ఆలయ ధర్మకర్త గుర్రం వెంకటేశం పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి